క్లుప్తంగా

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు

ధర్పల్లి: గోవింద్‌పల్లి, దమన్నపేట్, డీబీతండా, సీతాయిపేట్ గ్రామాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా భీంగల్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు ఈత వనాల గురించి వివరించారు. ఎక్సైజ్ సీఐ వేణు మాధవరావు, కానిస్టేబుళ్లు ఫయాజ్, శ్రీనివాస్, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

తెయూ కామర్స్ విభాగాధిపతిగా రాంబాబు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్–ఛాన్స్‌లర్ సందీప్‌కుమార్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ప్రొఫెసర్ రాంబాబు ప్రస్తుతం కామర్స్ విభాగానికి డీన్‌గా వ్యవహరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇందల్వాయి: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, తమ డిమాండ్లను నెరవేర్చాలని ఇందల్వాయి పీహెచ్‌సీలో ఆశా వర్కర్లు గురువారం నిరసన చేపట్టారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, 18 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని, టీఏ, డీఏలను సకాలంలో చెల్లించాలని, తమకు నష్టం కలిగించే పరీక్ష విధానాన్ని కేంద్రం ప్రభుత్వం రద్దు చేయాలని ఆరోగ్య కేంద్రం వైద్యుడు సంతోష్‌కి వినతి పత్రం అందించారు. మద్దతుగా జిల్లా సీఐటీయూ నాయకులు రాచకొండ విఘ్నేష్ నిరసనలో పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

నిజామాబాద్‌రూరల్: మల్కాపూర్ జీపీకి చెందిన బడోల్ల గంగాధర్ ఈ ఏడాది జనవరిలో ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. గంగాధర్ గుండారం ఎస్‌బీఐలో రూ.20 లక్షల ప్రమాదబీమా తీసుకున్నాడని బ్యాంక్ మేనేజర్ సునీల్ తెలిపారు. బుధవారం ఆయన భార్య బడోల్ల సరోజనమ్మకు రూ.20 లక్షల చెక్కును అందజేశారు. చీఫ్ మేనేజర్ బడావత్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు

మోపాల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను బుధవారం ఏర్పాటుచేశారు. రైతు నేస్తం ద్వారా రైతులకు సాగుపై సలహాలు, సూచనలు, అవగాహన కల్పించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను వ్యవసాయ శాఖ అన్ని రైతువేదికల్లో ఏర్పాటు చేస్తున్నారని ఇన్‌చార్జి ఏవో జాదవ్ హీరా, ఏఈవో చక్రపాణి తెలిపారు.

నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వ్యాపార వాణిజ్య సంస్థలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. నగరంలోని అర్సపల్లి ప్రాంతంలోని సీటీ ఆస్పత్రి, నాలెడ్జ్ పార్కు స్కూల్‌కు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఆర్‌వో నరేందర్, సిబ్బంది ఉన్నారు.

ఎఫ్ఎస్‌టీపీ వర్క్‌షాప్‌నకు మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌నాగారం: హైద్రాబాద్‌లోని పార్క్‌హోటల్‌లో ఎఫ్ఎస్‌టీపీ(ఫికల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)రాష్ట్రస్థాయి వర్క్‌షాపుపకు నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు బుధవారం హాజరయ్యారు. సెప్టిక్ ట్యాంక్‌ల్లోని వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించి గ్యాస్ తయారు చేయడానికి వాడే నూతన టెక్నాలజీ గురించి ఈ వర్క్‌షాపులో వివరించారు.

నిందితులను శిక్షించాలి

నిజామాబాద్‌అర్బన్: అశ్వరావుపేట ఎస్సై శ్రీరాములు శ్రీను ఆత్మహత్యకు కారకులను శిక్షించాలని బుధవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తరపున నిరసన చేట్టారు. ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర బాధ్యులు యానం విజయ్ కుమార్, లింగన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు .

మెరుగైన వైద్యం అందించాలి

నిజామాబాద్‌అర్బన్: పాఠశాలలో విద్యార్థిని విద్యుత్ షాక్‌కు గురైందని తెలిసి సారంగాపూర్ ఉన్నత పాఠశాలను పీడీఎస్‌యూ నాయకులు సందర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. విద్యుత్ షాక్‌కు గురి కావడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ఉచిత వైద్యం అందించి, విద్యార్థిని కుటుంబానికి రూ.2లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

అమ్మవెంచర్‌లో విద్యుత్ లైట్లు అమర్చాలి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గల అమ్మవెంచర్‌లో విద్యుత్ లైట్లు అమర్చాలని కాలనీవాసులు బుధవారం మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌కు విన్నవించారు. కాలనీ ప్రతినిధులు మాడవేడి వినోద్‌కుమార్, స్వామియాదవ్, రెంజర్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు!

- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా దాటవేస్తున్న అధికారులు
- పేదల నిర్మాణాలపై చిన్నపాటి ఫిర్యాదులు వచ్చినా కూల్చివేతలు



సెట్‌బ్యాక్ లేకుండానే నగరంలోని గంగాస్థాన్ ఫేజ్‌-3లో నిర్మాణాలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలో కనీస నిబంధనలు పాటించకుండానే నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతినిత్యం ఇళ్లు, వ్యాపార వాణిజ్య సంస్థల నిర్మాణానికి సంబంధించి పదుల సంఖ్యలో టౌన్‌ప్లానింగ్ అధికారులే అనుమతులు ఇస్తున్నారు. కాగితాల్లోనే నియమ, నిబంధనలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు.. ముట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే మాత్రం ఇదిగో.. అదిగో అంటూ అధికారులు కాలయాపన చేయడం మామూలు అయిపోయింది. పేదలు, సామాన్యులకు సంబంధించి 100 గజాల్లో నిర్మించిన భవనాలకు సెట్‌బ్యాక్ లేదని ఫిర్యాదులు వస్తే ఆగమేఘాల మీద కూల్చివేసిన ఘటనలు బోలెడన్ని ఉన్నాయి.

రేపు మాపు అంటూ..

ఈ ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న విషయాన్ని 2022 జూన్ 24న ఫిర్యాదు చేయడంలో నిర్మాణాలు జరగకుండా ఆపివేశారు. మళ్లీ ఇటీవల పనులు చేపట్టిన విషయాన్ని తెలుసుకున్న ఫిర్యాదుదారుడు ఈ నెల 4న ఫిర్యాదు చేశాడు. అయితే కమిషనర్ దగ్గర ఉండే అధికారి రేపు, మాపు అని చెబుతున్నాడని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం ఇదే విషయం చెబుతున్నారని తెలిపారు.

రాతపూర్వకంగా ఫిర్యాదు..

నగరంలోని గంగాస్థాన్ ఫేజ్–3లో నిబంధనలు పాటించకుండానే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని మహేంద్ర దంతాల్ అనే వ్యక్తి ఈ నెల 4న మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేపడుతూ, తన ఇంటికి సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. కనీసం పనులను ఆపడం లేదు. ఫిర్యాదులు ఇచ్చిన విషయాన్ని అధికారులు, సంబంధిత కార్పొరేటర్‌కు తెలియజేయడంతో ఫిర్యాదుదారుడిని బెదిరించారు.

ఫిర్యాదు రాకుండానే ఎన్నో నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని ఎలాగు పట్టించుకో రు. ఫిర్యాదు వచ్చిన వాటిపై స్పందించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బెదిరిస్తున్నారు

నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదు. సీసీ సైతం రేపు, మాపు వస్తారని చెబుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా మా ప్రాంత కార్పొరేటర్ ఫిర్యాదు చేసినందుకు బెదిరిస్తున్నారు. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేస్తున్నారు. వెంటనే పనులు ఆపి చర్యలు తీసుకోవాలి. – మహేంద్ర దంతాల్, ఫిర్యాదుదారుడు

పరిశీలిస్తాం

నిజామాబాద్ రూరల్ ఎమ్మార్వో, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలన చేయడానికి ఈ రోజు వెళ్తున్నాం. ఫిర్యాదుపై కమిషనర్ ఆదేశాల మేరకు సైట్‌కు వెళ్తాం. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్, టీపీఎస్

డంపింగ్‌యార్డు బయటే చెత్త



నాగారంలో స్థానికులు అడ్డుకోవడంతో డంపింగ్ యార్డు బయట నిలిచిపోయిన చెత్త వాహనాలు



మున్సిపల్ సిబ్బందితో ప్రజల వాగ్వాదం

- చెత్త వాహనాలను అడ్డుకున్న నాగారం ప్రజలు

నిజామాబాదనాగారం : డంపింగ్‌యార్డులో వేయాల్సిన చెత్త, చెదారం అంతా గేటు బయటే వేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడే చెత్తను వేస్తున్నారు. దీంతో నాగారం ప్రాంతంలో ఉన్న పలు కాలనీల ప్రజలకు దుర్వాసన వస్తోందని వాపోయారు. బుధవారం చెత్తవాహనాలను అడ్డుకున్నారు. చెత్తను డంపింగ్‌యార్డులో వేయకుండా ఎక్కడ పడితే అక్కడే వేయడం ఏంటని స్థానికులు ప్రశ్నించారు. రెండు గంటల పాటు చెత్తవాహనాలను కదలనివ్వలేదు. మున్సిపల్ సిబ్బంది సముదాయించి మళ్లీ ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని చెప్పడంతో



డంపింగ్‌యార్డు బయట వేసిన చెత్త

స్థానికులు శాంతించారు. ఈ నెల 9న డంపింగ్‌యార్డును మున్సిపల్ కమిషనర్ మంద మకరందు పరిశీలించినా డంపింగ్‌యార్డులో విధులు నిర్వహించే సిబ్బంది పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారు.

రైతులకిచ్చిన హామీలు అమలు చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. హామీలు అమల్జేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా రూ.15 వేలు ఎకరానికి రైతు భరోసా పథకాన్ని అమల్జేయకపోవడం సిగ్గుచేటన్నారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు పథకాన్ని అమల్జేయాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలుచేయాలని లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పొట్కూరి తిరుపతిరెడ్డి, నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, కొడవు భరత్ భూషణ్, అంతిరెడ్డి హరీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బీసీల అభ్యున్నతికి మేధావులు కలిసి రావాలి

నిజామాబాద్‌నాగారం: తెలంగాణలో బీసీల అభ్యున్నతికి తెలంగాణ మేధావులు కలిసి రావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. బీసీల అభ్యున్నతికి డాక్టర్ కేశవులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తెలంగాణలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై 14న 'బీసీ సమాజం అభివృద్ధి– తక్షణ కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్రస్థాయి అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు మంత్రిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను మంత్రి విడుదల చేశారు. 14న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని డాక్టర్ కేశవులు తెలిపారు. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్ర కుమార్, ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరుకానున్నారని తెలిపారు.



మంత్రికి ఆహ్వాన ప్రతిని అందజేస్తున్న కేశవులు

అమ్మ పేరుతో ప్రతిఒక్కరూ మొక్క నాటాలి

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: పీఎం నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం నగరంలోని మార్వాడీగల్లిలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈసందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలు మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకమని, పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. హిందూ సంస్కృతి ప్రకారం సౌరశక్తిని సూర్యదేవునిగా, జలాన్ని గంగాదేవిగా కొలుస్తున్నామన్నారు. అలాగే చెట్లను కూడా పూజించే సంస్కృతి మన దేశంలో ఉందని, ఔషధ గుణాలున్న అరటి, రావి, తులసి, మర్రి, మామిడి, వేప వంటి చెట్లను పెరట్లలో పెట్టుకుని పూజించాలని కోరారు. 75వ వన మహోత్సవం సందర్భంగా మనం అందరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, పంచరెడ్డి శ్రీధర్, మల్లేష్ గుప్తా, నాయకులు బద్దం కిషన్, ఆనంద్, మఠం పవన్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

'వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి'



మోపాల్: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ జీఎం సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం తాడెంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోపాల్‌లో మొక్కలు నాటారు. ఈసందర్భంగా సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవంలో ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. ఎంపీడీవో లింగం నాయక్, ఏపీవో సునీత, జూనియర్ అసిస్టెంట్ భోజన్న, తదితరులున్నారు.

'ఐసీడీఎస్‌కు కేటాయింపులు పెంచండి'

మోపాల్: కేంద్ర ప్రభుత్వం 2024–25 బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు కేటాయింపులు పెంచాలని, ఐసీడీఎస్ రక్షణ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను 3వ తరగతి, హెల్పర్లను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెగ్యులరైజేషన్, 45వ ఐఎల్‌సీ సిఫార్సులను అమల్జేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు, పెన్షన్ నెలకు రూ.10 వేలు చెల్లించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమల్జేయాలని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీల ప్రతినిధులు రాజ్యలక్ష్మీ, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిరికొండ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షులు జయంతి డిమాండ్ చేశారు. తహసీల్దార్ రవీందర్‌రావుకు ఈమేరకు వినతి పత్రం బుధవారం అందజేశారు. గతంలో 24 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలు పద్మావతి, సరోజన, ఉమారాణి, రాధకృష్ణ, స్వప్న, విజయలత, విజయలక్ష్మి, సంతోష, పద్మ, మానస, అనిత, గంగాలక్ష్మి పాల్గొన్నారు.

ఐటీఐ గ్రౌండ్‌లో పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఐటీఐ గ్రౌండ్‌లో ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ కోరిక మేరకు 50వ డివిజన్ కార్పొరేటర్ బట్టు రాఘవేందర్ సహకారంతో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను సమకూర్చారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పృథ్వీరాజ్, కోశాధికారి కృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

ధర్పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీవో శ్రీనివాస్ అధికారులకు సూచించారు. బుధవారం నడిమితండా, రూప్‌సింగ్ తండా, కార్నల్‌తండా, హోన్నాజీపేట్, వాడి గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నీలకంఠేశ్వరాలయంలో బహిరంగ వేలం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో పలు మడిగెలకు, ఒక ఖాళీ స్థలానికి బుధవారం బహిరంగ వేలం వేశారు. ఒక షాపు గాను నెలకు రూ. 16 వేలు, మరో షాపునకు రూ.3,500, ఖాళీ స్థలానికి రూ.5,600 నెలకు కిరాయి చెల్లించేవిధంగా వేలం నిర్వహించారు. అదే విధంగా ఇతర వేలంలు పాడారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఏఈ వేణు, తదితరులున్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథాన్ని తాళ్లతో లాగుతున్న భక్తులు

డిచ్‌పల్లి: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఇందూరు ఆధ్వర్యంలో మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా కొనసాగింది. మండల కేంద్రంలోని శ్రీకాశీ విశ్వనాథ ఆలయం వద్ద ఇస్కాన్ ఇందూరు జిల్లా అధ్యక్షుడు సిద్ధ బలరాందాస్ కొబ్బరి కాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. జై జగన్నాథ, జైజై జగన్నాథ అంటూ నినాదాలు చేస్తూ భక్తులు తాళ్లను లాగుతూ రథయాత్రలో పాల్గొన్నారు. రథం ముందు భక్తులు భజన పాటలు, కీర్తనలు పాడుతూ కోలాటాలు ఆడుతూ ముందుకు సాగారు.

భక్తి శ్రద్ధలతో రుక్మిణీ కళ్యాణం



ఆశీర్వాదం తీసుకుంటున్న ధన్‌పాల్ దంపతులు

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో ఉమామహేశ్వర దేవాలయంలో బుధవారం రుక్మిణీ దేవి కల్యాణం అంగరంగా వైభవోపేతంగా నిర్వహించారు. అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత సప్తహ ప్రవచనాలను బ్రహ్మశ్రీ ఫణతుల మేఘనాథ శర్మ 8 రోజులుగా ఇందూరు నగర ప్రజలకు బోధించారు. రుక్మిణి దేవి కల్యాణ మహోత్సవానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేఘనాథ శర్మ భగవద్గీత సారాంశాన్ని భక్తులకు ప్రవచించారని, సమస్త మానవాళికి భగవద్గీత ఆదర్శమన్నారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇందూరు భక్త బృందం ఆగమయ్య గురుస్వామి, ఎంసాని రవి, లాభిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి



సిరికొండ: గ్రామ పంచాయతీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నేడు పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేశ్ తెలిపారు. సిరికొండలో ముట్టడి కార్యక్రమ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. సాయారెడ్డి, రాజలింగం, బొర్రన్న, సాయిలు, రాజవ్వ, సాయవ్వ, సుజాత, రాజవ్వ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,900	వెండి (కిలో)	93,000
22 క్యారెట్స్	67,247		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	75	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
జిర్కినుకాయ	80	100	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	30	50
వంకాయ	10	10	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	75	చామగడ్డ	35	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	50	70
పుదీనా	80	120	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్




ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్‌-1	కల్కి-2898 ఏడీ(తెలుగు)-12.25, 3.50,7.15
స్క్రీన్‌-2	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30 కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) -2.00, 5.30,9.30
స్క్రీన్‌-3	కల్కి-2898 ఏడీ (3డీతెలుగు) - 4.05, 07.20, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్‌-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)- 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్‌-2	డెస్పి ఎబుల్ మీ4(3డీ-తెలుగు) - 11.40, 2.00, 6.30, 10.15 డెస్పి ఎబుల్ మీ4(3డీ- ఇంగ్లీష్)- 9.00
స్క్రీన్‌-3	ఎం.ఎస్.ధోని (హిందీ)- 11.30, 10.45 కల్కి-2898 ఏడీ(తెలుగు)-3.15, 7.00
స్క్రీన్ -4	కిల్(హిందీ)-11.15, 1.45, 8.00, 10.30 - ఎం.ఎస్.ధోని(హిందీ)- 4.15
దేవి	మహారాజ (తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

పురం నవీన్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమి స్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి పురం నవీన్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ అసోసియేట్ ప్రొఫెసర్ బి.సాయిలు పర్యవేక్షణలో 'సింథసిస్ అఫ్ నావెల్ అమైడ్ ఫంక్షనలైజ్‌డ్ ట్రిఫోరో మిథైల్ పిరిడిన్ డెరివేటిషియన్స్, ధీర్ ఫార్మాకోలాజికల్ యాక్టివిటీ' అనే అంశంపై నవీన్ పరిశోధన జరిపి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు నాందేడ్, లాల్‌బహదూర్ శాస్త్రి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్‌బీ పట్వారీ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ సీహెచ్ హారతి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు. నవీన్‌ను సత్కరించి, అభినందించారు.

శానిటేషన్ పనుల పరిశీలన

నిజామాబాద్‌నాగారం: సీజనల్ వ్యాధులు దృష్టిలో పెట్టుకొని నగరంలోని అర్సపల్లిలో చేపడుతున్న పనులను డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో సాజీద్‌అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.